# జ్ఞానోదయం



**బి. వెంకటేశ్వర్లు**

తన గుడిసె ముందు కూర్చొని దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు రంగడు. ఓసారి మేఘాలవైపు చూసి...

మేఘమా! ఎంత పనిచేస్తివి నువ్వు? వర్షాలు కురిపించక, పంటలు పండించక మాబోటి పేద రైతులను అప్పులపాల్జేసి తిండితిప్పలు లేకుండా చేసినావు. ఇది నీకు న్యాయమా? అని ప్రశ్నిస్తున్నట్లున్నాయి అతని చూపులు.

రంగడికి భార్య లక్ష్మమ్మ, వయసుకు ఎదుగు

తున్న ఇద్దరు ఆడబిడ్డలూ ఉన్నారు. వర్షాలులేక, పంటలు పండక అప్పులపాలై ఉన్న కాస్త భూమి నీ తాకట్టు పెట్టాడు. ఇప్పుడు పూటగడవడమే గగనమైపోయింది. ఎక్కడికైనా వలసవెళ్లి భార్యా పిల్లలను పోషించుకోవాలన్న ఆలోచనలో ఉన్నా డు రంగడు.

అప్పుడే అతనికి తెలిసిన మేస్త్రీ రంగడి దగ్గరి కొచ్చాడు.

"ఏమిటి రంగయ్యా! ఏదో ఆలోచిస్తున్నట్లు న్నావు" అడిగాడు మేస్త్రీ.

కూర్చో మేస్త్రీ... అని "ఏం చెప్పమంటావు మా బాధలు?" అంటూ తన కష్టాలు ఏకరువు పెట్టాడు.

"రంగా! నేను నీ కోసమే వచ్చానయ్యా. మన పక్కూర్లో పెద్ద ఫ్యాక్టరీ కడుతున్నారు. కూలీ లను సమకూర్చే బాధ్యత నేను తీసుకున్నాను. ఫ్యాక్టరీ పూర్తికావడానికి చాలాకాలమే పడుతుం ది. ఒక్కో కూలీకి రోజుకు నూటయాభై ఇస్తారు. ఆడ కూలీలకు వంద ఇస్తారు. నువ్వు, నీ భార్య నాతో రండి. రోజుకు రెండొందల యాభై సం పాదించుకోవచ్చు. అక్కడే ఓ చిన్న ఇల్లు అద్దెకు తీసుకొందురు. నువ్వు వస్తానంటే వెయ్యిరూపా యలు అడ్వాన్స్ కూడా ఇస్తాను. ఆలోచించు" అన్నాడు.

"ఆలోచించేదేముంది మేస్త్రీ... మేము వ స్తాం" అన్నాడు.

"అలాగే. రేపు ఉదయాన్నే బయలుదేరి అక్క డికి రండి" అంటూ వెయ్యిరూపాయలు ఇచ్చి వెళ్లిపోయాడు.

రంగడు ఈ విషయం భార్యతో చెప్పాడు. ఆమె కూడా సరే అంది.

ఉదయాన్నే అందరూ ఆ గ్రామానికి చేరు కొని, మేస్త్రీని కలిసారు. వాళ్లకోసం అప్పటికే ఓ అద్దె ఇల్లు చూసిపెట్టాడు. మేస్త్రీ వాళ్లను తీసుకెళ్లి ఆ ఇంట్లో విడిచి, "రేపటి నుంచి పన్లోకి రండి" అని చెప్పి వెళ్లిపోయాడు.

ఆ దంపతులు పన్లో చేరి నెల కావస్తోంది. సంపాదన ఏడు వేలు దాకా వచ్చుంటుంది. తిండి ఖర్చులు పోను ఐదువేలు వరకూ మిగి లింది.

అంత మొత్తం కూడిన డబ్బుచూసి వాళ్ల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

ఇలాగే నెలనెలా కూడితే తాకట్టుపెట్టిన భూమిని త్వరలోనే స్వంతం చేసుకోవచ్చని ఆరుబయట కూర్చొని మాట్లాడుకుంటున్నారు రంగడు, అతని భార్య.

ఆ ఊర్లో స్థానికంగా ఉన్న ఓ అరవై ఏళ్ల వ్యక్తి అటు వెళ్తూ రంగణ్ణి చూసి ఎక్కడో చూసా నే అని ఆలోచిస్తూ ఎక్కడ చూసానో అని బాగా గుర్తు తెచ్చుకొని, రంగడి దగ్గరికొచ్చి "నీ పేరు రంగడు కదూ. నువ్వు మంత్రాల మారెప్ప కొడు కువేకదా? అడిగాడు.

తండ్రి పేరు చెప్పగానే రంగడు "అవును కూర్చోండి" అన్నాడు.

అతడు కూర్చుంటూ "ఇక్కడికెందుకొచ్చా రు?" అనడిగాడు.

వచ్చిన పని చెప్పాడు రంగడు.

"మీ నాన్న మంత్రాలు, తాయత్తులూ వేసి రోగాలు నయంచేస్తాడు కదూ! నేనొకసారి యంత్రం కట్టించుకోవటానికి మీ ఇంటికి వచ్చాను. అప్పుడు నిన్ను చూసినాను. చాలా ఏళ్లయింది" అన్నాడు.

"ఆ... అప్పట్లో వేసేవాడు. నేనేమీ పెద్దగా

పట్టించుకునేవాణ్ణి కాదు. ఇప్పుడు లేడు. చని పోయినాడు" చెప్పాడు రంగడు.

"నువ్వూ ఆ విద్య నేర్చుకున్నావా?" అడిగాడు కుతూహలంగా.

"నేను ఊరికే చూసేవాణ్ణి నాకేం పెద్దగా తెలీదు" అన్నాడు.

"వచ్చుంటుందిలే! తండ్రి విద్య కొడుక్కి రాకుండా ఉంటుందా? సర్లే... నేవెళ్లొస్తాను" అని చెప్పి వెళ్లిపోయాడు.

ఆ ముసలాడు వెళ్లి గ్రామంలో అందరికీ చెప్పాడు.

"మనూరికి మంత్రాలు వేసే పక్కూరి రంగడొచ్చాడు. మనకే రోగమొచ్చినా వాడిదగ్గరి కెళ్తే ఇట్టే నయం చేస్తాడని" ప్రచారం చేసాడు.

మూఢ నమ్మకాలు, మూఢాచారాలు పాటిస్తున్న ఆ పల్లె ప్రజలు "అయితే ఏరోగమొచ్చినా డాక్టర్ దగ్గరికెళ్లి ఇంతింత డబ్బు ఖర్చుపెట్టే బాధ తప్పిపోయిందన్నమాట" సంతోషంగా అనుకున్నారు మనసుల్లో.

ఆ రోజు నుంచి రంగడు ఎక్కడ కనిపించినా ఇదే విషయమై అడిగేవారు గ్రామస్థులు.

అట్లాంటి విద్య నాకు రాదు మొర్రో అన్నా, అతడ్ని పొగడ్తలలో ముంచెత్తి ఆకాశానికెత్తేసేవారు.

రోజు రోజుకీ తనపై పొగడ్తల వర్షం కురిపిస్తూంటే అది సహించని రంగడు ఓ దశలో తిరిగి తమ ఊరు వెళ్లిపోదామనుకున్నాడు. కానీ తన భూమిని ఎలాగైనా స్వంతం చేసుకోవాలనే పట్టుదలతో అక్కడే ఉండాల్సి వచ్చింది.

ఆ రోజు ఆదివారం. పనిలేకపోవడంతో రంగడు ఇంటి దగ్గరే ఉన్నాడు.

ఉన్నట్టుండి ఓ పదిమంది దాకా రంగడి ఇంటికొచ్చి "రంగడూ... రంగడూ" అని కేక లేసారు.

"ఎవరబ్బా అనుకొని... రంగడు బయటికి వచ్చి చూసాడు".

ఇద్దరు వ్యక్తులు ఓ అమ్మాయిని గట్టిగా పట్టుకొని ఉన్నారు. ఆ అమ్మాయి పూనకం వచ్చిన దానిలా ఊగిపోతూఉంది. హిస్టీరియా వచ్చిన దానిలా అరుస్తోంది.

అందులో ఒకడు – "అయ్యా! ఈ అమ్మాయికి అప్పుడప్పుడూ గాలిసోకుతుంది. అందుకే ఇలా ప్రవర్తిస్తూ ఉంటుంది. నువ్వు మంత్రాలు వేస్తావంట కదా! నీ హస్తవాసి కూడా బాగుంటుందట కదా! ఎలాంటి రోగాన్నైనా గాని, ఎటువంటి గాలిచేష్టనైనా గానీ ఇట్టే పోగొడ్తావంట కదా! ఎలాగైనా ఈ గాలిచేష్టని పోగొట్టండి" అని వేడుకుంటున్నారు.

"చూడండి... అటువంటివి నాకు తెలీవు. ముందు డాక్టరు దగ్గరకు తీసికెళ్లండి" అన్నాడు చిరాకుపడుతూ.

"వైద్యంతో పోయే రోగం కాదిది. మంత్రాలతోనే పోతుంది. ఈ అమ్మాయి పరిస్థితి చూడు" అని మొండిపట్టు పట్టారు.

ఏమీ తెలియని అమాయకుడైన రంగడికి వాళ్లకెలా నచ్చచెప్పాలో అర్థంకాలేదు. ఊరికే ఉండిపోయాడు ఆలోచిస్తూ.

"ఏం ఆలోచిస్తున్నావు?... లోపలికి పదండి... అంటూ అందరూ లోపలికి దూసుకెళ్లిపోయారు.

వాళ్లే ఆ అమ్మాయిని ఓ చోట కూర్చోబెట్టారు. ఆమె ముందు తమలపాకులు, నిమ్మకాయలు, పూజసామాగ్రినంతా పెట్టి కొంత డబ్బు

కూడా పెట్టారు.

ఇదంతా చూస్తున్న రంగడి భార్య "అన్నా! ఆయనకి ఇటువంటివి ఏమీ తెలీవు. ఇదంతా దండగ. ముందు ఆ అమ్మాయిని ఆసుపత్రికి తీసుకుపోండి" అని ఎంతగానో నచ్చచెబుతోంది. అయినా వాళ్లు ససేమిరా అన్నారు.

పిల్లలిద్దరూ తమ ఇంట్లో ఏదో వేడుక జరుగుతోందన్న సంబరంతో చూస్తుండిపోయారు.

ఈ తతంగమంతా చూస్తున్న రంగడికి ఏమి చేయాలో పాలుపోక, ఎలాగైనా వారి బారి నుంచి తప్పించుకోవాలని చూస్తున్నాడు.

కానీ ఆ ఛాన్స్ లేనట్లు అందరూ అతని చుట్టూ గుమిగూడారు.

వీళ్లు నన్ను విడిచిపెట్టేట్లు లేరు. ఏదో ఒకటి త్వరగా చేయాలని అక్కడ ఉన్న ఓ నిమ్మకాయ తీసికొని, కోసి రసంపిండి కాస్త పంచదారవేసి నీళ్లు కలిపి బాగా గిలకొట్టి వాళ్లకిచ్చాడు తాపించమని.

మానసిక వ్యథతో సరిగా భోజనం చేయని ఆ యువతికి నిమ్మరసం తాగించారు.

నీరసంగా, నిస్సత్తువగా ఉన్న ఆమె ఆ పానీయం తాగగానే శక్తి వచ్చిన దానిలా కాస్త ఊరట చెందింది. అక్కడున్న వారంతా సంతోషపడిపోతూ "చూడయ్యా! నీ హస్తవాసి ఎంతపని చేసిందో! రోగం కుదిరింది" అని రంగడ్ని మెచ్చుకుంటూ ఆ యువతిని తీసుకొని తిరుగు ముఖం పట్టారు.

తనకు దక్షిణగా పెట్టిన డబ్బువైపు చూసిన రంగడు ఆ డబ్బు తీసుకొని వాళ్లకు తిరిగి ఇవ్వబోయాడు.

వాళ్లు తీసుకోలేదు. తీసికెళ్లండి... అని ఎంత బ్రతిమిలాడినా తీసుకోకుండానే వెళ్లిపోయారు.

ఇంటి కెళ్లిన ఓ గంట తర్వాత ఆ యువతి చనిపోయింది. ఆమె చావుకి కారకుడు రంగడు అని అక్కడున్నవాళ్లు తమ అనుమానాన్ని వెలిబుచ్చారు.

"వాడేవో తప్పుడు మంత్రాలు చదివి, నీళ్లల్లో ఏదో కలిపిచ్చాడు. అందుకే ఆమె చనిపోయిందని నిర్ధారణకు వచ్చారు.

ఈ వార్త దావానలంలా ఊరంతా వ్యాపించింది. ఊరు ఊరంతా రంగడి మీద ఆగ్రహావేశాలతో ఊగిపోయారే కానీ, ఆమె ఎందువల్ల చనిపోయిందని కొంచెం కూడా ఆలోచించ లేదు.

ఆమెకు ఎన్నాళ్ల నుంచో క్షయవ్యాధి వుంది. డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లి వైద్యం చేయించకుండా యంత్రాలు, మంత్రాలు అని మూఢనమ్మకంతో ఎక్కడెక్కడో తిరిగి తాయెత్తులు కట్టించి, నాటు వైద్యం చేయించి కాలయాపనచేసి ఆమె ఆరోగ్యాన్ని వాళ్లే క్షీణింపచేసారు. వ్యాధి ముదిరిపోయేట్టు చేసారు. చివరకు ప్రాణం పోయే దశలో అమాయకుడైన రంగడి దగ్గరకు తీసుకువచ్చి ఆమె చావుకు అతడ్ని కారకుడ్ని చేసారు.

క్షణాల్లో గ్రామస్థులంతా చనిపోయిన ఆ యువతి ఇంటికి చేరుకున్నారు. రంగడికి శాపనార్థాలు పెట్టారు.

మరి కొందరు అర్థంలేని ఆవేశంతో "రే! ఇట్లాంటి మంత్రగాడు మనూర్లో ఉండకూడదు. మనూర్లోనే కాదు ఎక్కడికెళ్లినా ఇట్లాగే జరుగుతుంది. ముందు వాణ్ణి చంపేయాలి. వాణ్ణి బతకనీయకూడదు. పదండి... పదండి..." అని ఎవడో అంటే "ఊ...! పదండి వాణ్ణేసేద్దాం..."

అంటూ అందరూ వంతపాడుతూ కర్రలు, కొడ వళ్లు పట్టుకుని రంగడి మీద దాడికి బయలు దేరారు.

తనను బూతులు తిట్టుకుంటూ కోపంతో రగిలిపోతూ తనింటివైపే దూసుకు వస్తున్న జనాన్ని చూసి బెదిరిపోయాడు రంగడు.

ఎవరు వీళ్లంతా...? నన్నెందుకలా దూషి స్తూ ఇటువైపు వస్తున్నారని అయోమయంలో ఉండగా...


రంగడితో పని ఉండి అప్పుడే అక్కడికి వచ్చాడు మేస్త్రీ. వాళ్లంతా రంగడి దగ్గరికొచ్చి చొక్కా పట్టుకొని -

"రేయ్! అన్యాయంగా మా బిడ్డను పొట్టన పెట్టుకున్నావుకదరా! నిన్ను ఏమాత్రం వదలం. ఇక్కడే సజీవ దహనం చేస్తాం. అప్పుడు గానీ నీలాంటి వాళ్లకు బుద్ధిరాదని కర్రలెత్తి కొట్టబో తూండగా మేస్త్రీ అడ్డుపడి "అసలేం జరిగింది చెప్పండి. రంగడి విషయంలో ఏదైనా తప్పు జరిగివుంటే నేనే శిక్షిస్తాను" అని వాళ్లకి సర్దిచెప్పి శాంతింపజేసాడు.

ఆ ఊరివాళ్లకు కూడా పని కల్పించిన మేస్త్రీ అంటే వారందరికీ గౌరవాభిమానాలున్నాయి. దాంతో అతడి మాటకు విలువనిచ్చి విషయ మంతా వివరించారు.

రంగడు కూడా జరిగిన విషయాలన్నీ చెప్పా డు.

అంతా విన్న మేస్త్రీ విచారం వ్యక్తం చేస్తూ



రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ కె. రోశయ్య చేతుల మీదుగా "ఉగాది విశిష్ట పురస్కారం" అందుకుంటున్న సీనియర్ జర్నలిస్ట్, రచయిత శ్రీ వీరాజీ. సమాచార శాఖ మంత్రి శ్రీమతి గీతారెడ్డి కూడా చిత్రంలో ఉన్నారు.

వాళ్లల్లో తీవ్రంగా నాటుకుపోయిన మూఢనమ్మకాలని ఎలా తొలగించాలా అని ఆలోచించి...

"చూడండి. చచ్చిపోయిన ఆ అమ్మాయికి ఏదో పెద్ద జబ్బే ఉండొచ్చు. రంగడు నిమ్మరసం మాత్రమే తాగించాడు. అది ఆరోగ్యానికి మేలు చేస్తుందే కానీ కీడుచేయదు. మీరు అనవసరంగా రంగడి మీద నిందవేసి అతడ్ని చంపాలని చూసారు.

ఒక్క విషయం ఆలోచించండి... ఆ అమ్మాయిని చంపాలని రంగడికి ఎందుకుంటుంది? ఆమె అతడికి శత్రువా? గొడవపడి విడిపోయిన బంధుత్వమా? పరిచయస్తురాలా? లేకుంటే రంగడిని మోసగించిందా? అసలు ఆమె ముఖమే సరిగా ఎరగని రంగడు ఆమెని ఎందుకు చంపుతాడు? అసలు తప్పు మీది. అనవసరంగా రంగడు మాంత్రికుడు, తాంత్రికుడని ముద్రవేసింది మీరు. ఆమె చావుకు కారకులు కూడా మీరే.

ఉన్న ఊర్లో భూమిని నమ్ముకొని, అప్పుల పాలై తిండీ తిప్పలు లేని పరిస్థితుల్లో పొట్టచేత్తో పట్టుకొని కుటుంబంతో పాటు ఇక్కడికి వచ్చాడు... ఏదో నాలుగురాళ్లు సంపాదించుకుందామని. అట్లాంటివాణ్ణి మీ మూఢనమ్మకాలతో కడ తేర్చాలని చూసారు.

ఈ పరిస్థితుల్లో నేనే రాకుండా ఉండి ఉంటే అతడి భార్య, పిల్లల గతేంటి? వారికి దిక్కెవరు? వీధుల వెంట తిరుగుతూ బిచ్చగాళ్లలా అడుక్కోవాల్సి వచ్చేది. అదే జరిగివుంటే ఆ పాపం మీ అందరిదీ కాదా? ఇలాంటి పనికిమాలిన మంత్రాలు, చేతబడులతో చంపే విద్యే ఉంటే ఇన్ని హత్యలు ఎందుకు జరుగుతాయి? చేతబడి చేసో, మంత్రాలు చదివించో చంపొచ్చు కదా!

దయచేసి నా మాట వినండి. తరతరాలుగా వస్తున్న ఈ మూఢనమ్మకాలను మనసులోంచి తరిమికొట్టండి. మనం ఆటవికులం కాదు. ఆధునిక ప్రపంచంలో మనుగడ సాగిస్తున్నాం.

మీకేమైనా జబ్బులు వస్తే డాక్టర్ వద్దకు వెళ్లండి అంతేకానీ మంత్రగాళ్లంటూ, నాటు వైద్యమంటూ వాటి జోలికిపోతే ఫలితం ఇలాగే ఉంటుంది.

దయచేసి వాస్తవాలు గ్రహించండి. ఏదైనా పనిచేసే ముందు మంచి, చెడుల గురించి కాస్త ఆలోచించండి. ఆ ఆలోచనలే మిమ్మల్ని మంచి మార్గం వైపు నడిపిస్తాయి" అని వాళ్లకు నచ్చజెప్పాడు.

మేస్త్రీ చెప్పిన విషయమంతా విని, వాళ్లలో వాళ్లు తర్కించుకుని ఏదో ఊబిలోంచి బయటపడిన వాళ్లలా చేతుల్లో ఉన్న కర్రలను, కొడవళ్లనూ కిందపడేసి "మేస్త్రిగారూ! మీరు చెప్పింది నిజమని మేము నమ్ముతున్నాం. ఇంకెప్పుడూ ఇటువంటి మూఢనమ్మకాల జోలికి వెళ్లం. అనవసరంగా రంగడిని అనుమానించాం. ఇప్పుడు మీ ద్వారా అజ్ఞానంలోంచి బయటపడ్డాం. మమ్మల్ని క్షమించండి. రంగడూ! నువ్వూ క్షమించాలి" అంటూ జ్ఞానోదయం కలిగిన వాళ్లలా వెనుతిరిగి వెళ్లిపోయారు.

రంగడు కళ్లనీరు పెట్టుకొని "మేస్త్రిగారు మీరే రాకుండా వుంటే నా భార్యా పిల్లలూ ఏమయ్యేవాళ్లో ఏమో! ఇక మేము ఈ ఊర్లో ఉండం వెళ్లిపోతాం..." అన్నాడు.

"రంగా! ఆమాట అనకు. ఈ సంఘటన మంచికి జరిగిందో, చెడుకు జరిగిందో కానీ వాళ్లల్లో మాత్రం జ్ఞానోదయం కలిగింది. ఇక నీకేం భయంలేదు. నువ్వెక్కడికీ వెళ్లనక్కరలేదు" అంటూ వెళ్లిపోయాడు. ●